సాక్షి ప్రకాశం

బుధవారం | 19 | జూలై | 2023



మరణ ధ్రువీకరణ పత్రాలు వారంలో ఇవ్వాలి

మరణ ధ్రువీకరణ పత్రాలు వారంలో ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.

- 8లో..



పట్టపగలే చోరీ

మార్కాపురంలో దొంగలు పట్టపగలే ఓ ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి వెళ్లి నగలు, డబ్బు దొంగిలించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం 31/28

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఏకేయూకి నిధులు కేటాయించేందుకు కృషి

- టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి హామీ



టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఏకేయూ వీసీ మారెడ్డి అంజిరెడ్డి

ఒంగోలు: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయానికి ప్రభుత్వం తరఫున అవసరమైన నిధులు కేటాయించేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తానని తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ మారెడ్డి అంజిరెడ్డి తాడేపల్లిలో వైవీ సుబ్బారెడ్డిని కలిసి ఈమేరకు వినతిపత్రం అందించారు. జిల్లాకు విశ్వవిద్యాలయం దశాబ్దాల కల అని, అది నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన చేయించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

జిల్లాకు 10 వేల వీవీ ప్యాట్‌లు

ఒంగోలు అర్బన్: జిల్లాకు త్వరలో 10 వేల వీవీ ప్యాట్ యంత్రాలు వస్తున్నట్లు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. స్థానిక మామిడిపాలెంలోని ఈవీఎం గోదాములను మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా రెండు గోదాముల్లో ఉన్న బ్యాలెట్ యూనిట్‌లు, ఈవీఎంలు, ఇతర పరికరాలు, భద్రత చర్యలను పరిశీలించారు. రానున్న సాధారణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జిల్లాకు త్వరలో వీవీ ప్యాట్‌లు వస్తున్నట్లు చెప్పారు. వాటికి తగిన స్థలం కూడా ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా బాపట్ల జిల్లాకు రెండు వేల బ్యాలెట్ యూనిట్లు రానున్నట్లు తెలిపారు. దీనిలో వైఎస్‌ఆర్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి దామరాజు క్రాంతి కుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు రసైల్, కాలేషా, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక



కందుకూరు రూరల్: ఉమ్మడి ప్రకాశం జిల్లా సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ బాలుర జట్టును ఎంపిక చేసినట్లు ప్రకాశం జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి టీ సుబ్బారావు తెలిపారు. స్థానిక టీఆర్ఆర్ జూనియర్ కాలేజీ మైదానంలో మంగళవారం నిర్వహించిన ఎంపిక ప్రక్రియకు 30 మంది క్రీడాకారులు హాజరయ్యారని, వీరిలో ప్రతిభ చూపిన 12 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ జట్టు తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురంలో జరిగే 8వ సబ్ జూనియర్ రాష్ట్ర చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్ సురేష్, పీడీలు పాల్గొన్నారు.

ఆయుర్ధ..యజ్ఞం



అధికారంలో ఉన్నంత కాలం కిడ్నీ, ఫ్లోరైడ్ బాధితుల గోడు పట్టని టీడీపీ నేతలు నేడు మొసలి కన్నీరు కారుస్తున్నారు. ప్రాణాలు పోతున్నా స్పందించని వారు అండగా ఉంటామని ఉత్తుత్తి హామీల వర్షం కురిపిస్తున్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బాధితులకు కొండంత అండగా నిలిచింది. మెరుగైన వైద్య సేవలందించింది. ఆయువు పెంచేలా స్వచ్ఛ జలాలు అందించేందుకు జలయజ్ఞం చేస్తోంది.రూ.530 కోట్లతో రెండు మంచి నీటి పథకాలను తీసుకొచ్చింది. త్వరలో కృష్ణా జలాలు పరుగులు తీయనున్నాయి. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కీలక మంత్రిగా ఉన్న నారా లోకేష్ కిడ్నీ బాధితులను పట్టించుకున్న దాఖలాల్లేవు. యువగళం పేరుతో పాదయాత్ర చేస్తూ జిల్లాకు వచ్చిన ఆయన కిడ్నీ బాధితులకు ఉచితంగా స్వచ్ఛజలాలు అందజేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని జిల్లా వాసులు పెదవి విరుస్తున్నారు.

- ఫ్లోరైడ్ శాశ్వత పరిష్కారానికి వాటర్ గ్రిడ్
- సురక్షిత జలాలతో ప్రజల ఆరోగ్యానికి భరోసా
- కిడ్నీ రోగాలు, డయాలసిస్ కు చెక్
- టీడీపీ అధికారంలో ఉన్నంత కాలం బాధితులను పట్టించుకోని తండ్రీ కొడుకులు
- నేడు అండగా ఉంటామంటూ లోకేష్ హామీలపై ప్రజల విమర్శలు

కనిగిరి రూరల్: ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కనిగిరి ప్రాంతంలోని ఫ్లోరైడ్, కిడ్నీ సమస్యపై సమర శంఖం పూరించారు. కనిగిరి ప్రాంతంలోని ఫ్లోరైడ్ నీటి సమస్యను అప్పటి ఎంపీ, ఇప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి ఫ్లోరైడ్, కిడ్నీ బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రతను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించారు. సురక్షిత జలాలు లేక, సరైన డయాలసిస్ వైద్యం లేక ఫ్లోరైడ్, కిడ్నీ బాధితులు అనేక మంది తల్లడిల్లుతున్నారని, అనేక మంది యుక్తవయసులోనే ప్రాణాలు కోల్పోతూ, మరికొందరు వికలాంగులుగా మారుతున్నట్లు వివరించారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా ఆయన పీసీపల్లికి వచ్చి బాధితులను పరామర్శించి వారి తరఫున దీక్ష చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక బాధితులకు బాసటగా నిలిచారు.



కనిగిరి డయాలసిస్ సెంటర్



కిడ్నీ, ఫ్లోరైడ్ బాధితులను పరామర్శిస్తున్న ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి(ఫైల్)

రూ.530 కోట్లతో రెండు మంచి నీటి పథకాలు

కనిగిరి పట్టణానికి సమగ్ర మంచినీటి పథకం

6 మండలాల్లోని 442 గ్రామాలకు సురక్షిత జలాలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన మార్పులు

- గతంలో డయాలసిస్ యంత్రాలు తక్కువగా ఉండేవి. దీంతో బాధితులు రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి. లేదా సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక డయాలసిస్ మిషన్ల సంఖ్య 17కు పెంచారు. దీంతో నియోజకవర్గంతో పాటు, నెల్లూరు జిల్లా వరికుంటపాడు, ఉదయగిరి ప్రాంతాలకు చెందిన వారు కూడా కనిగిరికి వచ్చి డయాలసిస్ సేవలు పొందుతున్నారు.
- గతంలో రోజుకు సుమారు 25 మందికి మాత్రమే డయాలసిస్ చేసేవారు. ప్రస్తుతం రోజుకు నాలుగు షిఫ్ట్‌ల్లో సరాసరిన 50 మంది డయాలసిస్ చేస్తున్నారు.
- ప్రస్తుతం స్థానిక డయాలసిస్ కేంద్రంలో 116 మంది బాధితులు డయాలసిస్ చేయించుకునేందుకు నమోదు చేసుకున్నారు.
- గత ప్రభుత్వంలో డయాలసిస్ బాధితులకు నెలకు రూ.3 వేలు పింఛన్ ఇచ్చేది. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దానిని రూ.10 వేలకు పెంచింది.
- కనిగిరి కేంద్రంలో 104 మంది కిడ్నీ బాధితులకు రూ.10 వేల పింఛన్ అందజేస్తున్నారు.
- 108 వాహనంలో బాధితులను డయాలసిస్ సెంటర్‌కు తీసుకెళ్లి చికిత్స అనంతరం ఇంటికి చేర్చుతున్నారు.
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో డయాసిస్ ఆధునికీకరణకు సుమారు రూ.10 లక్షల వరకు ఖర్చుపెట్టారు. నూతన వైరింగ్, అధునాతన స్టెబిలైజర్, మిషన్స్, జనరేటర్ ఏర్పాటు చేశారు.
- డయాలసిస్ కేంద్రంలో విద్యుత్ సమస్య తలెత్తకుండా సుమారు రూ.25 లక్షలతో అధునాతన 315 కేవీ ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేశారు.
- నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు.
- కనిగిరి నియోజకవర్గంలో 35 ఆర్‌ఓ ప్లాంట్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. త్వరలో మంజూరు కానున్నాయి.

ఉరుకులు పరుగులపై డయాలసిస్ కేంద్రం

ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కనిగిరిలో కిడ్నీ, ఫ్లోరైడ్ బాధితులతో మహాదీక్ష చేపడుతున్న విషయం తెలుసుకున్న అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆఘమేఘాలపై కనిగిరికి డయాలసిస్ సెంటర్ ప్రకటించి, ప్రభుత్వ ఆస్పత్రిలో 2017 ఏప్రిల్ 26న కేంద్రాన్ని అప్పటి వైద్యశాఖ మంత్రి ప్రారంభించారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాకతోనే తమకు న్యాయం జరిగిందని డయాలసిస్ బాధితులు హర్షం వ్యక్తం చేశారు. అప్పట్లో ఎంపీ వైవీ సుబ్బారెడ్డి నిధులతో కనిగిరి ప్రాంతంలో సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో ఆర్వో ప్లాంట్‌లను కూడా ఏర్పాటు చేశారు.


రూ.530 కోట్లతో కృష్ణా జలాలు

ఫ్లోరైడ్ మూలాలను పూర్తిగా తొలగించేందుకు, భవిష్యత్ తరాలు ఫ్లోరైడ్ నుంచి విముక్తి కలిగించేందుకు సీఎం వైఎస్ జగన్ కనిగిరిపై ప్రత్యేక దృష్టి సారించారు. రెండు నీటి పథకాలు మంజూరు చేశారు. రూ. 580 కోట్లతో కృష్ణా జలాలు అందించేందుకు శ్రీకారం చుట్టారు.

- రూ.130 కోట్లతో ఏఐఐబీ స్కీమ్ కింద కనిగిరి పట్టణానికి సమగ్ర మంచి నీటి పథకం మంజూరు చేశారు. పనులు జరుగుతున్నాయి.
- రూ.400 కోట్లతో నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని 442 గ్రామాలకు సురక్షిత జలాలు అందించేందుకు వాటర్ గ్రిడ్ పథకాన్ని మంజూరు చేశారు. వెలిగొండ ప్రాజెక్టు నుంచి కృష్ణా జలాలు తీసుకొచ్చేలా చర్యలు చేపట్టారు. టెండర్ ప్రక్రియ పూర్తయింది. త్వరలో పనులు ప్రారంభమవుతాయి.

వాస్తవాలు తెలుసుకో..

కిడ్నీ బాధితులకు అన్ని రకాలుగా అండగా నిలుస్తున్నారు సీఎం జగన్. వాస్తవాలు తెలుసుకోకుండా జిల్లాలో పాదయాత్ర చేస్తున్న లోకేష్ రాష్ట్ర ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని పట్టణ వాసులు అంటున్నారు. నాడు అధికారంలో ఉండి కూడా తండ్రీ కొడుకులు ఒక్కసారి కూడా పట్టించుకోకుండా నేడు వచ్చి సమస్యను పరిష్కరిస్తానంటూ ప్రకటనలు చేయడం సరికాదని నిలదీస్తున్నారు.



గొట్టిపడియ వద్ద నిర్మిస్తున్న పశ్చిమ ప్రకాశం వాటర్ గ్రిడ్ స్కీం ఇన్‌టెక్ వెల్

గతంలో నెల్లూరుకు వెళ్లేవాడ్ని



నేను 2017 నుంచి డయాలసిస్ చేయించుకుంటున్నాను. గతంలో కనిగిరిలో డయాలసిస్ సెంటర్‌లో వైద్యులు సక్రమంగా లేకపోవడంతో నెల్లూరు గ్లోబల్ ఆస్పత్రికి వెళ్లి చేయించుకున్నా. వారంలో రెండు మూడు సార్లు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం కనిగిరిలో చేయించుకుంటున్నా. ఇక్కడ బాగానే చేస్తున్నారు. దీంతో వ్యయ, ప్రయాసలు తగ్గాయి. గతంలో నాకు రూ.3 వేలు పింఛన్ ఇచ్చే వాళ్లు. ప్రస్తుతం రూ.10 వేలు పింఛన్ ఇస్తున్నారు. నేను వ్యవసాయం చేసుకుని జీవించే వాడ్ని. ప్రభుత్వం ఇచ్చే ఇచ్చే పింఛన్ నగదు ఎంతో ఉపయోగం పడుతుంది.

– వెంకటస్వామి, ఏరువారిపల్లి, కనిగిరి మండలం

గతంలో 8 సార్లు చేయించుకునే వాడ్ని



గతంలో డయాలసిస్‌కు బస్సులో వచ్చే వాడ్ని. సుమారు 36 కి.మీ దూరం కనిగిరికి రావాలి. చాలా ఇబ్బందిపడే వాడ్ని. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నేరుగా అంబులెన్స్‌లో వచ్చి చేయించుకుంటున్నా. గతంలో నెలలో 8 సార్లు డయాలసిస్ చేయించుకునే వాడ్ని, ఇప్పుడు 12 సార్లు చేయించుకుంటున్నా.

– దారా మాల్యాద్రి, గోపాలపురం, పామూరు మండలం

సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటా



నియోజకవర్గ ప్రజలకు ఫ్లోరైడ్ నుంచి విముక్తి కలిగించేందుకు రక్షిత జలాలను అందించాలని సీఎంకు విన్నవించా. నియోజకవర్గ అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారు.రూ.530 కోట్లతో రెండు మంచినీటి పథకాలు మంజూరు చేశారు. పనులు పురోగతిలో ఉన్నాయి. ఈ పథకాలతో ప్రతి ఒక్కరికీ కుళాయి ద్వారా సురక్షిత జలాలు అందిస్తాం. ఫ్లోరైడ్, కిడ్నీ బాధితుల సమస్య తీరుతుంది. నియోజకవర్గంలో సురక్షిత నీటి కోసం 35 ఆర్వో ప్లాంట్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. త్వరలో మంజూరు కానున్నాయి.

– బుర్రా మధుసూదన్ యాదవ్, కనిగిరి ఎమ్మెల్యే

యువగళానికి స్పందన అంతంతే..!

- కొండపిలో నిరాశాజనకంగా పాదయాత్ర
- అధిష్టానం నుంచి జిల్లా నేతలకు మొట్టికాయలు
- పక్క నియోజకవర్గాల నుంచి బస్సులో జనాల తరలింపు
- ఆకట్టుకోని ప్రసంగం
- కొద్దిసేపటికే ఇంటిదారి పట్టిన కార్యకర్తలు
- సెల్ఫీలు దిగండంటూ మహిళలకు టోకెన్లు



పీసీపల్లిలో : సెల్ఫీలు దిగాలంటూ మహిళలకు టోకెన్లు పంచుతున్న టీడీపీ నేతలు



వైన్ షాపుల వద్ద మద్యం తాగుతున్న మందుబాబులు

పొన్నలూరు: కొండపి నియోజకవర్గం పొన్నలూరు మండలంలో నారా లోకేష్ రెండు రోజుల పాటు చేపట్టిన యువగళం పాదయాత్రకు ప్రజల నుంచి స్పందన కరువైంది. ఎమ్మెల్యే బాలవీరాంజనేయ స్వామి, టీడీపీ శ్రేణులు అనుకున్న విధంగా పాదయాత్ర సక్సస్ కాకపోవడంతో టీడీపీ కార్యకర్తలు నిరాశ చెందారు. పగలు కాకుండా సాయంత్రం పాదయాత్ర చేయడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. చెరువుకొమ్ముపాలెంలో పొగాకు గ్రేడింగ్ కూలీలతో సమావేశం ఏర్పాటు చేశారు. రెండు గంటలకు పైగా మహిళా కూలీలు వేచి ఉన్నారు. ఆలస్యంగా వచ్చిన లోకేష్ ఎవరితో మాట్లాడకుండా వెళ్లిపోవడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

చంద్రబాబు నుంచి మొట్టికాయలు...

కొండపి నియోజకవర్గంలోకి లోకేష్ పాదయాత్ర ప్రవేశించిన మొదటి రోజు టీడీపీ కార్యకర్తల నుంచి సరైన స్పందన రాలేదు. అతి తక్కువ మందితో పాదయాత్ర జరిగింది. దీనిపై చంద్రబాబు జిల్లా పార్టీ నాయకులకు మొట్టికాయలు వేసినట్లు సమాచారం. జన సమీకరణ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఎలా? ఇలా అయితే ప్రజల్లో యువగళం పాదయాత్రపై ప్రజల్లో పలచనైపోతుందని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో తేరుకున్న టీడీపీ జిల్లా నాయకత్వం రెండో రోజు కే అగ్రహారంలో ఏర్పాటు చేసిన సభకు కొండపి నియోజకవర్గానికి దగ్గరగా ఉన్న నియోజకవర్గాల నుంచి ప్రైవేట్ బస్సులు, వాహనాలు, భోజనాలు ఏర్పాటు చేసి కొంతమేర జన సమీకరణ చేశారు. వాస్తవంగా ఎమ్మెల్యే స్వామి, దామచర్ల సత్య సభకు రావాలని నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి వాహనం ఏర్పాటు చేశారు. అయితే కొన్ని గ్రామాల టీడీపీ కార్యకర్తలు సభకు రామంటూ ఖాళీ వాహనాలను వెనుకకు పంపినట్టు తెలిసింది. ఇదిలా ఉండగా బహిరంగ సభ కే అగ్రహారం సెంటర్‌లోని ఓపీ రోడ్డుపై ఏర్పాటు చేయడంతో ప్రయాణికులతో పాటు, ప్రజలు కొంతసేపు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. లోకేష్ ప్రసంగం ఆకట్టుకోలేకపోయింది. ఎప్పటిలాగే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు గుప్పిస్తుండటంతో కొంత అసహనం చెందిన ప్రజలు, కార్యకర్తలు సభా ప్రాంగణం నుంచి ఇంటి బాట పట్టారు. ప్రసంగం చేపట్టిన ఇరవై నిమిషాలకే కార్యకర్తలు చాలా వరకు అక్కడ నుంచి వెళ్లిపోయారు. పాదయాత్రతో ఎమ్మెల్యే స్వామి, టీడీపీ నాయకులు ఆర్భాటాలు చేశారు తప్పా తమకు ఒరిగిందేమీలేదని ప్రజలు అంటున్నారు.

సెల్ఫీలు దిగండమ్మా...!

పీసీపల్లి: అధికార కాంక్ష కోసం యువగళం పేరుతో టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర మంగళవారం కనిగిరి నియోజకవర్గంలో పీసీపల్లి మండలం పాలేటి గంగ నుంచి ప్రారంభమైంది. లోకేష్‌కు కనిగిరి నియోజకవర్గ నాయకులు స్వాగతం పలికారు. సెల్ఫీల కోసం ముందస్తుగా మహిళలకు టోకెన్స్ పంపిణీ చేయడం గమనార్హం. తమ నాయకునితో సెల్ఫీలు దిగాలంటూ మహిళలకు టోకెన్లు ఇస్తూ టీడీపీ నాయకులు బతిమిలాడుకోవడం కనిపించింది. లోకేష్ వచ్చాక ఎలా ప్రవర్తించాలి.. సెల్ఫీ ఎలా దిగాలి అని ముందస్తుగా వారిని సిద్ధం చేశారు. పాదయాత్ర జరిగే ప్రతిచోట మాకిదేమి ఖర్మ అంటూ తెలుగు తమ్ముళ్లు స్థానికులతో బహిరంగంగానే లోకేష్‌పై జోకులేసుకుంటున్నారు. దీంతో ఇదేమి విడ్డూరం అభిమానం ఉంటే స్వచ్ఛందంగా వస్తారు... ఇలా కూడా ప్రచారం చేస్తారా అని ప్రజలు నవ్వుకున్నారు.

మందుబాబుల హల్‌చల్

లోకేష్ యాత్రకు ప్రజలు కరువయ్యారు. ముఖ్యంగా ఇన్‌చార్జి ఉగ్ర మండలాల వారీగా వాహనాలు పెట్టి మద్యం, డబ్బులు పంచినా.. వారికి పనులున్న ఊరిలో .. అవసరమున్న చోటు దిగిపోయేసరికి తీరా యాత్రకు వచ్చేసరికి ప్రతి వాహనంలో ఇద్దరు ముగ్గురు మందుబాబులే మిగిలారు. వారి మధ్యే ప్రారంభమైన యాత్ర రాత్రి 10 వరకు జరిగి పెదఅలవలపాడు అంకమ్మ దేవస్థానంలో రాత్రికి బసచేశారు. యాత్ర అంతా ఏదో ఈవెనింగ్ వాకింగ్ చేస్తున్నట్లు ప్రజలతో మాట్లాడకుండా సాగింది.

పీడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా ప్రసాద్ రెడ్డి



ఒంగోలు సబర్బన్: డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు (పీడీసీసీబీ) చైర్మన్‌గా కనిగిరికి చెందిన వైఎం.ప్రసాద్ రెడ్డి (బన్నీ) నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీఓ ఆర్‌టీ నంబర్–498ని విడుదల చేసింది. ఈ పదవిలో ఆయన ఆరు నెలల పాటు కొనసాగుతారు. ఆ తరువాత తిరిగి పదవీ కాలాన్ని పొడిగిస్తారు. ఈ పదవిలో ఇప్పటి వరకు కొండపి నియోజకవర్గానికి చెందిన డాక్టర్ మాదాసి వెంకయ్య పని చేస్తూ వచ్చారు. బ్యాంకు నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీలో చైర్మన్‌ను ఒక్కరినే మార్చి వైఎం ప్రసాద్ రెడ్డిని నియమించారు. మిగతా పాత కమిటీలో ఆరుగురు సభ్యులు యధావిధిగా కొనసాగుతారు. 2024 జనవరి 17 వరకు బన్నీ చైర్మన్‌గా ఉంటారని ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. వైఎం ప్రసాద్ రెడ్డి ప్రస్తుతం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్నారు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి అనుయాయుడైన ప్రసాద్ రెడ్డి 2001 నుంచి 2006 వరకు కనిగిరి జెడ్పీటీసీ సభ్యునిగా పనిచేశారు. అనంతరం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చి వైఎస్సార్‌సీపీని స్థాపించిన నాటి నుంచి ప్రసాద్ రెడ్డి ఆయన వెన్నంటి ఉన్నారు. ప్రస్తుతం కనిగిరి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్‌గా ప్రసాద్‌రెడ్డి సతీమణి వై.సరితా రెడ్డి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రసాద రెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, తనకు పదవి వచ్చేలా కృషి చేసిన మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి, ఇతర జిల్లా నాయకులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు చెప్పారు. జిల్లాలోని రైతుల కోసం శక్తి వంచన లేకుండా పనిచేస్తానన్నారు.

చిరు వ్యాపారులకు జగనన్న తోడు



చిరువ్యాపారులకు జగనన్న తోడు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్, మేయర్ గంగాడ సుజాత, ఒడా చైర్‌పర్సన్ మీనా వెంకట్రావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్‌లు

- జిల్లాలో 23,474 మందికి లబ్ధి
- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: స్వయం ఉపాధి పొందుతున్న చిరు వ్యాపారులకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న తోడు ద్వారా అండగా నిలుస్తోందని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అన్నారు. జగనన్న తోడు పథకం కింద మంగళవారం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రుణాలు, వడ్డీ రీయింబర్స్‌మెంట్ డిపాజిట్ చేస్తున్న నేపథ్యంలో తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వీడియో సమావేశం ద్వారా ప్రారంభించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్‌తో పాటు మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, మేదర కార్పొరేషన్ లలితా నాంచారమ్మ, వైష్ణవ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కుమార్, రాష్ట్ర టైలర్స్ డెవలప్‌మెంట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ షేక్ సుభాన్‌బీ, ఒడా చైర్‌పర్సన్ శింగరాజు మీనాకుమారి, నగర మేయర్ గంగాడ సుజాత పాల్గొన్నారు. ఈ సందర్భంగా లలితకుమారి అనే లబ్ధిదారుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో మాట్లాడే అవకాశం కల్పించారు. ఆమె తనకు కలిగిన ఆర్థిక ప్రయోజనాన్ని వివరించి సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎటువంటి షూరిటీ లేకుండా చిరువ్యాపారులకు రూ.10 వేలు బ్యాంకు రుణం ఇప్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చిరువ్యాపారులను ఆదుకుంటోందన్నారు. సకాలంలో రుణాలు చెల్లిస్తే మరుసటి ఏడాది మరో వెయ్యి రూపాయలు అదనంగా ఇప్పిస్తోందన్నారు. చిరు వ్యాపారులపై ఎటువంటి భారం లేకుండా ఆ వడ్డీని ప్రభుత్వమే భరిస్తోందన్నారు. తాజాగా ఏడో విడతలో 23,474 మంది లబ్ధిదారులకు రూ.25,28,10,000 రుణంగా మంజూరైందని తెలిపారు. జిల్లాలో 25,220 మంది లబ్ధిదారులకు రూ.59,13,931 వడ్డీ రీయింబర్స్‌మెంట్ లభించిందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఏడు విడతల్లో కలిపి 1,76,701 మంది లబ్ధిదారులకు రూ.178.29 కోట్ల రుణాలు లభించినట్లు తెలిపారు. అదేవిధంగా వడ్డీ రీయింబర్స్‌మెంట్ కింద 1,94,289 మందికి రూ.4.23 కోట్ల ప్రయోజనం కలిగిందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, డీపీఎం సుబ్బారావు, సచివాలయాల కో ఆర్డినేటర్ ఉషారాణి ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అర్జీలు సకాలంలో పరిష్కరించాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా అందిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, ఆ మేరకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అన్నారు. ప్రకాశంభవనం నుంచి వివిధ శాఖల అధికారులతో మంగళవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్, పోలీసు, మున్సిపాలిటీ శాఖల్లో పరిష్కరించాల్సిన అర్జీలు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఒంగోలు, మార్కాపురం, పొదిలి, యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల్లో కూడా అధికంగా అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నిర్దిష్ట గడువు లోగా పరిష్కరించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నివాస స్థలాలపై వెళ్తున్న విద్యుత్ లైన్‌లు వెంటనే తొలగించాలన్నారు. గర్భిణులు, బాలింతలు, ఐదేళ్ల లోపు పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపాన్ని నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

టంగుటూరులో చైన్ స్నాచింగ్

టంగుటూరు: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో బంగారు మంగళసూత్రాన్ని బైక్‌పై వచ్చిన ఓ యువకుడు లాక్కుని పరారయ్యాడు. ఈ సంఘటన టంగుటూరులోని లిటిల్ ఏంజెల్స్ స్కూల్ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. బాధితురాలు, పోలీసుల కథనం మేరకు.. టంగుటూరులోని ముత్తరాజుపాలేనికి చెందిన భీమనబోయిన శిరీష తన కూతురుకి లిటిల్ ఏంజెల్స్ స్కూల్లో భోజనం పెట్టి ఇంటికి వెళ్తోంది. అప్పటికే అక్కడ కాపు కాసి ఉన్న ఓ గుర్తు తెలియని వెనుక నుంచి వచ్చి సుమారు మూడు సవర్ల బంగారు మంగళసూత్రం చైనును లాక్కుని ఉడాయించాడు. శిరీష కేకలు విని చుట్టుపక్కల వారు వచ్చేసరికి ఆ యువకుడు ఆలకూరపాడు గ్రామం వైపు పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఖాదర్‌బాషా తెలిపారు.

TET-DSC
బ్యాచ్ ప్రారంభం 19-07-2023
MSR స్టడీ సర్కిల్
9959595984

ఖరీఫ్‌లో రైతులకు గుండ్లకమ్మ నీరు

● సీఎం దృష్టికి గుండ్లకమ్మ ప్రాజెక్ట్ గేట్ల మరమ్మతుల వివరణ
● ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి:

ఎన్ని ఇబ్బందులెదురైనా వాటిని పరిష్కరించి ఖరీఫ్ నాటికి రైతులకు సాగునీటిని అందిస్తామని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు తెలిపారు. ఒంగోలులోని తన కార్యాలయంలో మంగళవారం గుండ్లకమ్మ ప్రాజెక్ట్ ఇంజినీరింగ్ అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, స్థానిక రైతులతో గుండ్లకమ్మ ప్రాజెక్ట్‌పై ఎమ్మెల్యే టీజేఆర్ సమీక్ష నిర్వహించారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట్ గేట్లపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ఎమ్మెల్యే ఘాటుగా ఖండించారు. ఇప్పటికే గుండ్లకమ్మ ప్రాజెక్ట్‌లో మరమ్మతుల విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. గేట్ల మరమ్మతులకు తగిన చర్యలు తీసుకోవాలని సీఎం ఇరిగేషన్ ఇంజినీరింగ్ అండ్



అధికారులు, నేతలతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీఫ్‌ను ఆదేశించారని గుర్తు చేశారు. ఖరీఫ్‌లో రైతులకు ఎలాంటి విఘాతం లేకుండా సాగునీటిని అందించేందుకు ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గుండ్లకమ్మ నుంచి సాగునీరు ప్రవహించే కాలువల్లో పెరిగిన పిచ్చిమొక్కలు, సమ్ము వంటి ఇతర మొక్కలను తొలగించాలని స్థానిక రైతులు ఎమ్మెల్యే టీజేఆర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, వైఎస్సార్‌సీపీ మండలాల కన్వీనర్లు మండవ అప్పారావు, పోలవరపు శ్రీమన్నారాయణ, దుంపా చెంచిరెడ్డి, పమిడి వెంకటేశ్వర్లు, వాకా అరుణ కోటిరెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్‌లు, జేసీఎస్ కన్వీనర్‌లు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గడప గడపలో బ్రహ్మరథం

● గిద్దలూరు నియోజకవర్గంలో 50 వేల గడపలు పూర్తి
● 50 కేజీల కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే అన్నా, పార్టీ నేతలు

కంభం: వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజల ఆశీస్సులతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో 50 వేల గడపలు పూర్తి చేయడం సంతోషంగా ఉందని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం కంభం మండలంలోని తురిమెళ్ల గ్రామంలో పార్టీ నేతలతో కలిసి 50 కేజీల భారీ కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేశారు. 125 రోజులపాటు 47 సచివాలయాల పరిధిలో 50 వేల గడపలకు తన వెంట నడిచిన నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రజలు బ్రహ్మరథం పట్టారని, మిగిలిన గ్రామాల్లోనూ



తురిమెళ్లలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

ఇంటింటికీ వస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్లు యేలం వెంకటేశ్వర్లు, నెమలిదిన్నె చెన్నారెడ్డి, రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కసిరెడ్డి వెంకటరమణారెడ్డి, తురిమెళ్ల సర్పంచ్ సుభద్ర, మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డిష్ మున్నా, ఎంపీటీసీలు ఖాసింబీ, ఆనంద్, నాగరాజు, చిన్న కంభం సర్పంచ్ రసూల్, కటికల భాస్కర్, జాకీర్, శివ, హుస్సేన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ నంబర్ ఉండాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లాలో ప్రతి ఇంటికీ తప్పనిసరిగా ఇంటి నంబర్లు కేటాయించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్పెషల్ సమ్మరీవిజన్–2024 ప్రారంభిస్తున్న నేపథ్యంలో చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ వెలగపూడి నుంచి మంగళవారం కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ప్రకాశంభవనం నుంచి కలెక్టర్ ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ ఈఆర్‌ఓలకు పలు సూచనలు చేశారు. బీఎల్‌ఓలు లేని చోట్ల వెంటనే నియమించి




చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ, సబ్ కలెక్టర్, ఇతర అధికారులు

ఖాళీలు భర్తీ చేయాలన్నారు. ఓటర్ల మార్పులు, చేర్పులు పారదర్శకంగా ఉండేలా జాగ్రత్తగా పనిచేయాలన్నారు. వలంటీర్లు దీనిలో ప్రమేయం లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ శ్రీలత ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

నిజం దాచి నిందలేల?

● తిమ్మపాలెంలో గ్రామ కంఠం భూమిలో టీడీపీ నేత దుకాణం
● ఊరంతా వారిస్తున్నా అధికార మదంతో నాడు దబాయింపు
● హైకోర్టు ఆదేశాలతో దుకాణం తొలగించిన పంచాయతీ అధికారులు
● ఇవన్నీ విస్మరించి వైఎస్సార్ సీపీపై విషం కక్కిన లోకేష్



షెడ్ తొలగించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు కాపీ

పొన్నలూరు: టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తన యువగళం పాదయాత్ర మొదటి రోజు తిమ్మపాలెం చేరుకున్న సమయంలో అదే గ్రామానికి చెందిన టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మోరుబోయిన మాల్యాద్రి ఓ వినతి పత్రం అందజేశారు. తను నడుపుతున్న కిరాణా షాపును గ్రామంలోని వైఎస్సార్ సీపీ నాయకులు కూల్చివేశారని లోకేష్‌కు వివరించాడు. ఇక అంతే.. లోకేష్ మైకు చేతపుచ్చుకుని రాష్ట్ర ప్రభుత్వంతోపాటు వైఎస్సార్ సీపీ నాయకులపై అక్కసు వెళ్లగక్కారు. పచ్చి అబద్ధాలు వల్లె వేశారు.

ఇదిగో ఇదీ వాస్తవం : పొన్నలూరు మండలం చెరుకూరు రెవెన్యూ పరిధిలోని తిమ్మపాలెం గ్రామ సర్వే నంబర్ 769/2లో గ్రామ కంఠం భూమి 8.63 ఎకరాలు ఉంది. ఊరి మధ్యలో ఉన్న కొంత భూమిని గ్రామస్తుల అవసరాలకు ఖాళీగా ఉంచారు. కాలక్రమంలో అక్కడ వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేశారు. పక్కనే కొంత స్థలంలో డీప్‌బోర్ వేసి మోటారు ఏర్పాటు చేశారు. అయితే 2014లో టీడీపీ అధికారంలోకి రాగానే వాటర్ ట్యాంక్‌ను ఆనుకుని ఉన్న ఒక సెంటు గ్రామ కంఠం భూమిలో మాల్యాద్రి ఎలాంటి అనుమతి లేకుండా రేకుల షెడ్ నిర్మించి కిరాణా షాపు ఏర్పాటు చేశాడు. వాటర్ ట్యాంక్ పక్కనే షాపు ఏర్పాటు చేస్తే అసౌకర్యంగా ఉంటుందని పార్టీలకు అతీతంగా గ్రామస్తులు వారించారు. అధికారం చేతిలో ఉంది కదా అని మాల్యాద్రి గ్రామస్తులను బెదిరించాడు. దీంతో పంచాయతీ అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. వారు క్షేత్రస్థాయిలో అన్నీ పరిశీలించి గ్రామ కంఠం భూమిలో అనుమతి లేకుండా నిర్మించిన రేకుల షెడ్‌ను తొలగించాలని నోటీసులు ఇచ్చారు. మాల్యాద్రి స్పందించకపోవడంతో గ్రామస్తులు తగిన ఆధారాలతో మాల్యాద్రి అక్రమాలపై హైకోర్టులో ఫిర్యాదు చేశారు. అన్ని ఆధారాలను పరిశీలించిన హైకోర్టు వెంటనే గ్రామ కంఠం భూమిలోని ఆక్రమణలు తొలగించాలని ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మాల్యాద్రికి ముందుగానే పంచాయతీ అధికారులు నోటీసులు ఇచ్చి 2021 జనవరి 25వ తేదీన రేకుల షెడ్ తొలగించారు. ఈ సంఘటనతో రాష్ట్ర ప్రభుత్వానికి, వైఎస్సార్ సీపీ నాయకులకు ఎలాంటి సంబంధం లేదు. కానీ, లోకేష్ కళ్లార్పకుండా అబద్ధాలు చెప్పడాన్ని చూసి తిమ్మపాలెం వాసులు నివ్వెరపోయారు.

మరణ ధ్రువీకరణ పత్రాలు వారంలో ఇవ్వాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: మరణ ధృవీకరణ పత్రాల కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న వారికి వారంలో పత్రాలు అందచేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రకాశం భవనం నుంచి మండల స్థాయి అధికారులతో మంగళవారం పలు అంశాలపై వీడియో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్సార్ బీమా పొందేందుకు మరణ ధ్రువీకరణ పత్రం అవసరం ఉన్నందున జాప్యం లేకుండా వారికి వెంటనే ధ్రువీకరణ పత్రాలు అందించాలన్నారు. కల్యాణమస్తుకు సంబంధించిన దరఖాస్తులను బుధవారం సాయంత్రం లోగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏపీ సేవా సర్వీసులకు సంబంధించిన నగదును జమ చేయకుండా పెండింగ్‌లో ఉంచిన సిబ్బందికి ఈ నెల జీతం బిల్లులు నిలిపివేస్తామన్నారు. సచివాలయ సిబ్బంది రెండు పూటల బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా మంజూరైన పనులు త్వరగా ప్రారంభించాలన్నారు. ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశాలను ఎంపీడీఓలు తనిఖీలు చేయాలన్నారు. మస్టర్‌లు ఎప్పటికప్పుడు అప్‌లోడ్‌చేసి సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. హార్టీకల్చర్ పనులకు సంబంధించిన ప్రతిపాదనలు త్వరగా పంపాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ శ్రీనారెడ్డి, హౌసింగ్ పీడీ పేరయ్య, సీపీఓ వెంకటేశ్వర్లు, గ్రామ సచివాలయాల నోడల్ అధికారి ఉషారాణి పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

ADMISSIONS

■ MPHW (F) - ANM (2 Yrs) రెగ్యులర్ నర్సింగ్ ట్రైనింగ్ & DMLT కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. Q: ఇంటర్ ఎనీగ్రూప్, SC, ST, BC, OBC లకు స్కాలర్‌షిప్ & హాస్టల్ వసతి కలదు. సంప్ర।। థూన్సీ నర్స్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, ఒంగోలు. ✆ 94402 74196 [OA-16]

■ Sapthagiri College of Engg - TN Admissions 2023-24 Low Pack, AI & DS, CS, CSE, IT, ECE, EEE, Civil, MECH, EIE. ✆ 90877 02696, 87123 45068 [O-787291]

PARAMEDICAL

■ NKRM Junior College ఫ్లై ఓవర్ బ్రిడ్జి దగ్గర, భారత్ పెట్రోలు బంకు దగ్గర, కర్నూలు రోడ్డు ఒంగోలు. Our Opportunity For Better Jobs in Health Care Industry పారామెడికల్ కోర్సు MPHW (F) నర్సింగ్ + Inter Bi.PC + అప్రెంటీస్ ట్రైనింగ్ = Job. M.L.T ల్యాబ్‌టెక్నీషియన్ + Inter Bi.PC + అప్రెంటీస్ ట్రైనింగ్ = JOB. Course Period: 2 Yrs, అప్రెంటీస్ ట్రైనింగ్ 1 Year. Q: 10th Pass. అడ్మిషన్లు జరుగుచున్నవి. Con: ✆ 91103 22249, 76749 98230 [OA-10]

■ ప్రభుత్వ గుర్తింపు కలిగిన పారామెడికల్ డిప్లొమా కోర్సులకు 2023-2024 సం।।నకు అడ్మిషన్లు జరుగుచున్నవి. DMLT (మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ) DOA (ఆప్తాల్మిక్ అసిస్టెంటు), DRGA (రేడియోగ్రాఫిక్ టెక్నీషియన్) అర్హత: ఇంటర్, స్కాలర్‌షిప్ సౌకర్యం కలదు. పరమేశ్వరి కాలేజ్ ఆఫ్ పారామెడికల్ సైన్సెస్, ఒంగోలు. ✆ 72075 55666, 96408 24225 [OA-979]

■ B.Sc Nursing,BPT& Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-1489]

Real Estate

POLT FOR SALE

■ ఒంగోలుకు అతిదగ్గరలో ఇల్లు కట్టుకొనుటకు అన్ని వసతులుగల DTCP APP లేఅవుట్ నందు ఓపెన్‌ప్లాట్స్ - గది- 35000/- ఇండిపెండెంట్ హౌసెస్ అమ్మకమునకు కలవు. బ్యాంక్‌లోన్ సౌకర్యంతో. K.R. డెవలపర్స్ ✆ 91600 14196 [O-787288]

■ శుభం డెవలపర్స్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న రామయ్యపట్నం పోర్టుకి, ఎయిర్ పోర్టుకి, అతి చేరువలో అన్ని సకల సదుపాయాలతో ఓపెన్ ప్లాట్స్ అతి తక్కువ ధరలో కలవు. 9666557889 [G-303]

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి, ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) సం।। ✆ 99121 05656. [O-787290]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-781993]

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో ఉన్నవి ఈ రోజు ఆన్‌లైన్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్ (100% జెన్యూన్) సంప్ర: ✆ 945 945 3338 [B-336]

Wanted

■ సింగరాయకొండ శ్రీ చైతన్య స్కూలు నందు పనిచేయుటకు జంట్స్ వార్డెన్లు టీచర్లు కావలెను. సంప్రదించండి ✆ 96038 45549 [O-759034]

■ మా సెక్యూరిటీ సంస్థ నందు S కొండ పరిసరాలలో పనిచేయుటకు సె।।గార్డ్‌లు & ASO లు కావలెను. మంచి జీతం + PF & ESI, రూం, భోజనం ఫ్రీ ✆ 70751 48896, 87909 35585 [O-786142]

■ డిజిటల్ మార్కెట్ ఎగ్జిక్యూటివ్స్ 2 సం।।ల అనుభవం కలిగి ఉండవలెను. గ్రాఫిక్ డిజైనర్-2 సం।। అనుభవం సేల్ ఎగ్జిక్యూటివ్స్ (Freshers) M/F కావలెను. వయస్సు 30 సం।।లోపు ఉండవలెను. సంప్ర।। ✆ 77999 93718 [OA-18]

■ ఒంగోలు, ఆక్వాగార్డ్ ఆఫీసు నందు పనిచేయుటకు సేల్స్‌మెన్, సర్వీస్ టెక్నీషియన్ కావలెను. ఆసక్తిగలవారు సంప్ర।। ✆ 98667 15926, 90307 15926 [O-786141]

■ AIRTEL XSTREM ఫైబర్‌లో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ M/F కావలెను. Q: ఇంటర్ ఆపైన. జీతం : 15వేలు ఆపైన సంప్ర।। ✆ 91210 01175, 83280 44994 [O-786140]

■ ఒంగోలు నందు పెస్ట్ కంట్రోల్ స్ప్రేచేయుటకు Male (మగ) వర్కర్స్ & రెస్టారెంట్ నందు పనిచేయుటకు లేడీ క్యాషీయర్స్, సెక్యూరిటిగార్డ్ కావలెను. ✆ 96660 47473, 99857 08883 [O-786139]

■ ఒంగోలులోని ప్రముఖ E/M హైస్కూల్ నందు 1st to 5th వరకు మ్యాథ్స్, 6th to 9th మ్యాథ్స్, ఫిజిక్స్, 1st - 9th కంప్యూటర్స్, P.E.T & హ్యాండ్‌రైటింగ్ టీచర్స్ M/F వెంటనే కావలెను. సం।। ✆ 83094 26888 [O-787289]

■ వర్షిత ఫైనాన్షియర్ (D.S.A నందు) పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. (కార్ & కమర్షియల్‌లోన్స్) Q: ఇంటర్/డిగ్రీ+ 2సం।। అనుభవం. జీ।।20వేలు / ఆపైన ✆ 93906 50048, 99591 80161- స్టోన్ హౌస్‌పేట - నెల్లూరు. [O-787287]

■ ప్రముఖ 2వీలర్ ఫైనాన్స్ కంపెనీలో ఒంగోలు, కందుకూరు బ్రాంచ్‌లలో పనిచేయుటకు మార్కెటింగ్ మేనేజర్స్, సేల్స్ & కలెక్షన్ ఏజెంట్స్ కావలెను. Q: M.O- డిగ్రీ, M.A- 10th /ఆపైన.సం।।✆ 70329 87266, 80081 46515 [O-787286]

■ CMS కం।। నుండి బ్యాంక్ టు బ్యాంక్ ATM to ATM, Hyd & సికింద్రాబాద్‌లలో వెహికల్స్ నడుపుటకు డ్రైవర్లు కావలెను. జీ।। 15000 + PF + ESI. సం।। ✆ 92939 49853 [O-786137]

■ ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 9346276788. [M-1221456]

■ ప్రముఖ రియల్‌ఎస్టేట్ నందు డోర్ టూ డోర్ మార్కెటింగ్ చేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. 13k-30k. 9666557889 [G-302]

■ ప్రముఖ యాడ్ ఏజెన్సీ నందు పనిచేయుటకు ఫొటోషాప్, కొరల్‌డ్రా, 3D యానిమేషన్, డిజిటల్ డిజైనర్స్, ఆర్ట్ డిజైనర్స్, కాపీ రైటర్, క్రియేటివ్ హెడ్ కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత. 9966696393 [G-301]

■ ఒంగోలు RTC బస్టాండ్ ఎదురుగల మోర్ హైపర్ మార్ట్ నందు పనిచేయుటకు సెక్యూరిటి గార్డ్స్ కావలెను. అః 10th పాస్, Sal:12,000/9h, 4weeks of కలవు+ESI+PF, Age: below 40yrs 9985121999, 9885295999 [G-848]

■ గుంటూరు పెట్రోల్ బంక్‌లో పని చేయుటకు పంప్ బాయ్స్ కావలెను. (జీతం:12వేలు - డే బై డే డ్యూటీ) రూం, భోజనం ఫ్రీ. Contact: Mega Group. Cell: 83414 88088. [NA-5778]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వివరాలకు సంప్రదించండి :
క్లాసిఫైడ్స్ :
ఒంగోలు
90102 02856
90102 02762

యువతకు ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ ధ్యేయం

మార్కాపురం: యువతకు ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం, ఉపాధి కల్పనాధికారి టి.భరద్వాజ్ పేర్కొన్నారు. మంగళవారం మార్కాపురం పట్టణంలోని ఎస్‌ఏసీ సెంటర్‌లో మినీ జాబ్ మేళా, స్కిల్ హబ్ శిక్షణ కార్యక్రమం, సర్టిఫికెట్ ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు యువతకు ఉద్యోగాలు కల్పించడం కోసం అన్ని నియోజకవర్గాల్లో ప్రతి నెలా జాబ్ మేళాలను ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. 10వ తరగతి నుంచి పీజీ వరకు చదువుకున్న వారికి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో మూడు మల్టీనేషనల్ కంపెనీలు పాల్గొన్నాయని, మొత్తం 107 మంది అభ్యర్థులు హాజరుకాగా 59 మందిని ఎంపిక చేసి



ఉద్యోగులకు నియామకపత్రాలు అందిస్తున్న లోకనాథం

ఆఫర్ లెటర్లు అందించామని వివరించారు. స్కిల్ హబ్‌లో ఎలక్ట్రీషియన్ శిక్షణ పొందిన 30 మందికి సర్టిఫికెట్లు అందించామన్నారు. సెరీకల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. యువత జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ ఎంప్లాయిమెంట్ ఆఫీసరు రాజారావు, నాక్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగశేను, నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధులు సుల్తాన్‌బాషా, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి డబ్బు కాజేసిన మోసగాడికి జైలు

● పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ మలికా గర్గ్ అభినందన

ఒంగోలు/గిద్దలూరు రూరల్: ఏటీఎం సెంటర్ల వద్ద వృద్ధులను లక్ష్యంగా చేసుకుని వారి డెబిట్ కార్డును మార్చి డబ్బు కాజేసిన నిందితుడికి గిద్దలూరు ఏజేఎఫ్‌సీఎం కోర్టు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు వెల్లడించింది. స్వల్ప వ్యవధిలోనే నిందితునికి శిక్ష పడేలా గుడ్ ట్రయల్ మానిటరింగ్ నిర్వహించిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ మలికాగర్గ్ మంగళవారం అభినందించారు. గిద్దలూరు మండలం కొమ్మునూరుకు చెందిన సయ్యద్ చిన మదార్‌సాహెబ్ ఈ ఏడాది జనవరి 19న గిద్దలూరు టౌన్‌లోని ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్‌లో రూ.67 వేలు డిపాజిట్ చేసి మినీ స్టేట్‌మెంట్ కోసం బ్యాంకు బయట ఉన్న ఏటీఎం వద్దకు వెళ్లారు. అక్కడే ఉన్న పెద్దిరెడ్డి ఓబుల్‌రెడ్డిని సహాయం కోరారు. అతను హైదరాబాద్‌లోని కృష్ణా నగర్ నివాసి. మినీ స్టేట్‌మెంట్ చెక్ చేస్తున్నట్లు నటించి.. అది రావడం లేదంటూ ఏటీఎం కార్డును మార్చి మరో కార్డును వృద్ధుడికి అందించాడు. కొంత కాలం తర్వాత వృద్ధుడు డబ్బు తీసుకునేందుకు కుమారుడికి ఏటీఎం కార్డు ఇచ్చి పంపారు. అది తండ్రిది కాదని గుర్తించిన కుమారుడు బ్యాంకుకు వెళ్లి లావాదేవీలను పరిశీలించగా రూ.67 వేలు డ్రా అయినట్లు గుర్తించాడు. దీనిపై అప్పటి గిద్దలూరు ఎస్సై బ్రహ్మనాయుడు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సకాలంలో సాక్షులను కోర్టులో హాజరుపరచగా అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.రఘునాథరావు ప్రాసిక్యూషన్ తరపున వాదించారు. నేరం నిరూపణ కావడంతో గిద్దలూరు ఏజెఎఫ్‌సీఎం కోర్టు జడ్జి బి.మేరీ శారదమ్మ నిందితునికి 6 నెలల జైలు శిక్ష విధించారు. గుడ్ ట్రయల్ మానిటరింగ్ చేశారంటూ ప్రస్తుత గిద్దలూరు ఎస్సై మహేష్, అప్పటి ఎస్సై బ్రహ్మనాయుడు, గిద్దలూరు కోర్టు కానిస్టేబుల్ రాజేష్‌రెడ్డిని ఎస్పీ మలికా గర్గ్ అభినందించారు.

కలకలం రేపిన జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీలు

● ఉలిక్కిపడిన టీడీపీ నాయకులు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలోని ప్రధాన కూడళ్లలో జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీలు మంగళవారం కలకలం రేపాయి. ''కాబోయే ముఖ్యమంత్రి జూనియర్ ఎన్టీఆర్.. అసలోడు వచ్చే వరకు కొసరోడికి పండగే'' అని ఫ్లెక్సీల్లో స్పష్టంగా రాశారు. మంగళవారం తెల్లవారేసరికి ఒంగోలు నగరంలో దర్శనమిచ్చిన ఫ్లెక్సీలను చూసి టీడీపీ నాయకులు ఖంగుతిన్నారు. ఒక పక్క జిల్లాలో లోకేష్ యువగళం పాదయాత్ర సాగుతున్న నేపథ్యంలో జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీల ప్రదర్శనతో టీడీపీ శ్రేణుల్లో కొంత ఆందోళన.. మరికొంత ఆశ్చర్యం వ్యక్తమైంది. దీంతో ఉలిక్కిపడ్డ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నష్ట నివారణ చర్యలకు ఉపక్రమించారు. తన అనుచరులను పురమాయించి నగరంలో వెలిసిన ఫ్లెక్సీలను తొలగింపజేశారు.



ఒంగోలులోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీ

అనంతరం టీడీపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వైఎస్సార్ సీపీపై ఆరోపణలు చేయడం గమనార్హం. ఎన్టీఆర్ అభిమానులు తమ మనసులో కోరికను ఫ్లెక్సీల రూపంలో వ్యక్తపరిస్తే.. వైఎస్సార్ సీపీ నాయకులే కావాలని చేశారంటూ మాజీ ఎమ్మెల్యే కలరింగ్ ఇచ్చారు.

మార్కాపురంలో పట్టపగలే చోరీ

● మరో ఇంట్లో చోరీకి విఫలయత్నం

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో మంగళవారం పట్టపగలే దొంగలు బరితెగించారు. తాళాలు పగలగొట్టి ఇళ్లలోనికి ప్రవేశించి నగదు, బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. వివరాలు.. స్థానిక నాగులవరం రోడ్డులోని రాజ్యలక్ష్మి కాలనీలో నివాసముంటున్న వాలిచర్ల ప్రసాద్ ఇంట్లోకి చొరబడిన దొంగలు బీరువా పగలగొట్టి అందులో దేవుడి మొక్కు కోసం దాచి ఉంచిన రూ.13 వేల నగదు అపహరించారు. అయితే భయపడి ఆ నగదును మెట్లపక్కన వదిలివేయడంతో కుటుంబ సభ్యులు సాయంత్రం గుర్తించారు. ఆ ఇంటి పక్కనే ఉన్న తుంబేటి వెంకటసుబ్బయ్య ఇంటి తాళాలు పగలగొట్టి మూడు తులాల సరుదు, రెండు జతల కమ్మలు, రెండు ఉంగరాలు, నగదు కాజేశారు. చోరీ జరిగిన రెండు ఇళ్లను పట్టణ ఎస్సై శశికుమార్, క్లూస్‌టీమ్ పరిశీలించి ఆధారాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

చోరీ కేసులో మహిళ అరెస్టు

పట్టణంలోని దోర్నాల సెంటరులో గతనెల 5వ తేదీన జరిగిన దొంగతనం కేసులో నిందితురాలైన బాపట్ల జిల్లా ఈపూరుపాలేనికి చెందిన అలివేలును అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. దోర్నాలకు చెందిన రమాదేవి బంధువుల ఇంటికి వెళ్లి తిరుగు ప్రయాణంలో దోర్నాల సెంటరులో బస్సు ఎక్కింది. ఇంటికి వెళ్లి చూసుకోగా 20 సవర్ల బంగారు ఆభరణాలు కనిపించలేదు. ఈ కేసుకు సంబంధించి గత నెల 17న ఇద్దరిని అరెస్టు చేయగా మంగళవారం మరో మహిళను అదుపులోకి తీసుకుని బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

భార్యను వేధించిన భర్తకు రెండేళ్ల జైలు

కనిగిరి రూరల్: భార్యను వేధింపులకు గురిచేసిన కేసులో భర్తకు జైలు శిక్ష విధిస్తూ మంగళవారం కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి కె.భరత్ చంద్ర తీర్పునిచ్చారు. కోర్టు సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. కనిగిరి మండలంలోని ఎన్.గొల్లపల్లికి చెందిన కటికల బాబుపై ఆయన భార్య 2016లో పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై యు.శ్రీనివాసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు నేరం రుజువు కావడంతో నిందితుడు బాబుకు రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ తరపునన పబ్లిక్ ప్రాసిక్యూటర్ అరుణకుమారి వాదనలు వినిపించారు.

నల్లమల ఘాట్‌లో కారు బోల్తా

● ఒకరికి తీవ్రంగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలు

పెద్దదోర్నాల: బ్రేకులు ఫెయిలైన ఓ కారు అదుపు తప్పి ఆర్టీసీ బస్సును ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటన పెద్దదోర్నాల మండల పరిధిలోని చింతల గిరిజన గూడెం సమీపంలో చోటుచేసుకుంది. కారులో ప్రయాణిస్తున్న యర్రగొండపాలెంకు చెందిన ఎం. వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలు కాగా దాసరి వీరమ్మ, పాల్లెబోయిన శ్రీను స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రుల కథనం మేరకు.. ఓ కుటుంబంలో చెలరేగిన వివాదాన్ని పరిష్కరించేందుకు యర్రగొండపాలెం నుంచి వెంకటేశ్వర్లు, వీరమ్మ, శ్రీను కలిసి కారులో శ్రీశైలం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఉండగా చింతల వద్ద కారు బ్రేకులు ఫెయిలయ్యాయి. దీంతో కారు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొని రోడ్డు మార్జిన్‌లో బోల్తా పడింది. స్థానికులు స్పందించి క్షతగాత్రులను దోర్నాలలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్లును మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు



తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్లు

చేస్తున్నట్లు ఎస్సై అంకమరావు తెలిపారు.

బైకును ఢీకొట్టిన లారీ..

ముండ్లమూరు: ముండ్లమూరు–వేంపాడు గ్రామాల మధ్య చిలకలేరు వద్ద రోడ్డు ప్రమాదంలో తమ్మలూరు గ్రామానికి చెందిన చొప్పరపు గంగయ్యకు తీవ్రగాయాలయ్యాయి. దర్శి–అద్దంకి ప్రధాన రహదారిలో మంగళవారం బైక్‌పై వెళ్తున్న గంగయ్యను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలు కావడంతో 108 వాహనంలో అద్దంకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు తీసుకెళ్లారు.



చికిత్స పొందుతున్న గంగయ్య